VEGA JEWELLERS
దివిలోనైనా... భువిలోనైనా.. వేగ తోడుంటే
వివాహం వైభోగం అవుతుంది.
ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | USA
follow us vegajewellers

RNI NO : APTEL/2016/69464

# కలం కౌంటర్

KALAM COUNTER TELUGU DAILY

తెలుగు దినపత్రిక

సంపుటి : 10 సంచిక : 19

పేజీలు : 4 వెల రూ.4/-

Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor

బుధవారం 17 జూన్ 2026

## సెమీకండక్టర్ల తయారీకి ఏపీ బెస్ట్ డెస్టినేషన్

- స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఏపీ అత్యుత్తమం
- 30 రోజుల్లో ఏపీకి వచ్చి పరిశీలించాలని పారిశ్రామిక వేత్తలకు ఆహ్వానం
- సింగపూర్‌లో సెమీకండక్టర్లపై 'సెమీకాన్ ఎకోసిస్టమ్ సదస్సు'లో సీఎం చంద్రబాబు







**సింగపూర్, కలంకౌంటర్ :** సెమీకండక్టర్ల తయారీకి ఆంధ్రప్రదేశ్ అత్యుత్తమ గమ్యస్థానమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. 30 రోజుల్లో ఏపీకి వచ్చి అమల్లో ఉన్న పాలసీలను పరిశీలించాలని ముఖ్యమంత్రి సింగపూర్ పారిశ్రామిక వేత్తలకు పిలుపునిచ్చారు. సింగపూర్‌లో సెమీకాన్ రౌండ్ టేబుల్ సదస్సులో పాల్గొన్న ముఖ్యమంత్రి ఆంధ్రప్రదేశ్‌లో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాన్ని అనుసరిస్తున్నామని చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడులకు భారత్ అత్యంత సురక్షితమైన ప్రాంతమని, అందులో ఆంధ్రప్రదేశ్ అనుకూలమైన రాష్ట్ర మని... పెట్టుబడులకు ఇది సరైన సమయమని సీఎం వ్యాఖ్యానించారు. సెమీకండక్టర్ల తయారీకి ఏపీలో విస్తృతమైన అవకాశాలు ఉన్నాయని వివరించారు. రాయలసీమలో త్వరలోనే ఓ సెమీ కండక్టర్ల తయారీ పరిశ్రమ ఏర్పాటు అవుతోందని ముఖ్యమంత్రి తెలిపారు. డిఫెన్సు, ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్స్, ఫైటర్ జెట్‌ల తయారీ సహా ఆటోమొబైల్ తయారీ కేంద్రంగా రాయలసీమ ప్రాంతంలో అవకాశాలున్నాయని అన్నారు. సెమీకండక్టర్లపై ఏర్పాటు చేసిన సెమీకాన్ ఎకోసిస్టమ్ రౌండ్ టేబుల్ సమావేశానికి సింగపూర్ లోని వివిధ సెమీకండక్టర్ తయారీ పరిశ్రమల ప్రతినిధులు హాజరయ్యారు. గ్లోబల్ ఫౌండ్రీస్, ఎన్ఎక్స్ పీ, ఏఎస్ఎంపీటీ, ఒన్ సిస్టమ్ టెక్నాలజీస్, టెక్సెండ్ ఫోటోమాస్క్, ఆక్వాటెక్ తదితర సెమీకండక్టర్ తయారీ సంస్థలు ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్నాయి.

## సర్‌పై అత్యంత అప్రమత్తంగా ఉండాలి

- ఈ నాలుగు వారాలు అత్యంత కీలకం
- నియోజకవర్గ కో-ఆర్డినేటర్లు రోజూ సమీక్ష చేయాలి
- ఏదోరకంగా వైయస్సార్‌సీపీ ఓట్లు తొలగించేందుకు చంద్రబాబు కుట్ర
- అధికార దుర్వినియోగంతో ఓట్లు తీసివేసేందుకు ప్రయత్నం
- ప్రతి బూత్‌కు 50 వైయస్సార్‌సీపీ ఓట్లు తీసేయాలని చంద్రబాబు లక్ష్యంగా పెట్టుకున్నారు
- నియోజకవర్గ కో-ఆర్డినేటర్లు దీన్ని అడ్డుకోవాలి, ప్రతి ఓటునూ కాపాడుకోవాలి
- వైయస్సార్‌సీపీ అధ్యక్షుడు వైయస్.జగన్మోహన్‌రెడ్డి ఆదేశాలు



**తాడేపల్లి,కలంకౌంటర్ :** ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ( సర్)పై నియోజకవర్గాల్లోని కో-ఆర్డినేటర్లు, రీజనల్ ఇన్‌ఛార్జిలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని వైయస్సార్ సీపీ అధ్యక్షుడు వైయస్.జగన్మోహన్‌రెడ్డి ఆదేశించారు. సర్ ప్రక్రియ జరుగుతున్న తీరుపై ప్రతిరోజూ సమీక్ష చేయాలని, ఎక్కడైనా తప్పులు జరుగుతున్నాయని తెలిసిన వెంటనే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయలని, అప్పటికీ సమస్య పరిష్కారంకాకపోతే వెంటనే పార్టీ కేంద్ర కార్యాలయం దృష్టికి తీసుకు రావాలన్నారు. వచ్చే నాలుగు వారాలు అత్యంత కీలకమని, సర్ విషయంలో ఎట్టి పరిస్థితుల్లో నిర్లక్ష్యం వద్దన్నారు. సర్ ప్రక్రియలో ఒక్కసారి ఓటు తొలగించిన తర్వాత దాన్ని తిరిగి చేర్పించాలంటే అత్యంత కష్టమవుతుందన్నారు. ప్రతి నియోకవర్గ సమన్వయకర్త దీన్ని దృష్టిలో పెట్టుకోవాలన్నారు. మంగళవారం తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో పార్టీ సీనియర్ నాయకులతో శ్రీ జగన్ సమావేశమయ్యారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న చంద్రబాబు, తన అధికార దుర్వినియోగంతో ఏదోరకంగా వైయస్సార్‌సీపీకి చెందిన ఓట్లను తొలగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, బూత్‌కు కనీసంగా 50 ఓట్లు తొలగించాలని చూస్తున్నారన్నారు. గిమ్మిక్కులతో ఓట్లు తొలగించే తప్పుడు పనుల్లో చంద్రబాబు ఆరితేరిన వ్యక్తని, వైయస్సార్‌సీపీ కోఆర్డినేటర్లు, బూత్‌లెవల్ ఏజెంట్లు దీన్ని అడ్డుకోవాలని, ప్రతి ఓటునూ కాపాడుకోవాలన్నారు.

క్షేత్రస్థాయిలో జరుగుతున్న సర్ ప్రక్రియపై ప్రతి అంశంలోనూ అప్రమత్తత, నిరంతర సమీక్షలు నిర్వహించాలని వైయస్.జగన్ ఆదేశించారు.

## రెండేళ్లలో శాంతిభద్రతలు భేష్

- ప్రజా భద్రత, సైబర్ రక్షణ, విపత్తు నిర్వహణలో విశిష్ట పురోగతి - మంత్రి అనిత వంగలపూడి



**అమరావతి,కలంకౌంటర్ :** గత రెండేళ్ల కాలంలో శాంతిభద్రతల పరిరక్షణ, మహిళల రక్షణ, డ్రగ్స్ నియంత్రణ, సైబర్ నేరాల అరికట్టడం, విపత్తుల నిర్వహణ, జైళ్ల సంస్కరణలు, పోలీసు సంక్షేమం వంటి అన్ని రంగాల్లో సమగ్ర సంస్కరణలను చేపట్టి విశేష ఫలితాలు సాధించిందని రాష్ట్ర హోం వ్యవహారాలు మరియు విపత్తు నిర్వహణ శాఖ మంత్రి అనిత వంగలపూడి తెలిపారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రాజకీయ ప్రయోజనాలకు పరిమితమైన వ్యవస్థలను ప్రజా సేవా దృక్పథంతో పునర్నిర్మిస్తూ, ప్రజలకు జవాబుదారీగా పనిచేసే పరిపాలనా వ్యవస్థను ప్రభుత్వం నెలకొల్పిందన్నారు. ప్రజల భాగస్వామ్యం, పోలీసు-ప్రజల సమన్వయం, సాంకేతికత వినియోగం, పారదర్శక పరిపాలన, వేగవంతమైన స్పందన, చట్టాలను కఠినంగా అమలు చేయడం ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అత్యంత సురక్షిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు. నేరం జరిగిన తర్వాత స్పందించడం కాకుండా, నేరం జరగకుండా ముందుగానే నిరోధించడమే తమ ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ప్రజల భద్రత, మహిళల గౌరవం, యువత భవిష్యత్తు, సమాజ శాంతి కోసం రాజీపడకుండా తమ ప్రభుత్వం పనిచేస్తుందని అని మంత్రి స్పష్టం చేశారు.

**నేర నియంత్రణలో గణనీయ పురోగతి -- 14.1 శాతం**

**క్రైమ్ రేట్ తగ్గింపు...** తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తదుపరి సాంకేతిక పరిజ్ఞానం, సమర్థవంతమైన నిఘా వ్యవస్థలు, శాస్త్రీయ దర్యాప్తు పద్ధతులు, అంతర్‌శాఖ సమన్వయాన్ని మెరుగుపర్చడం ద్వారా రాష్ట్రంలో మొత్తం నేరాల శాతం సుమారు 14.1 శాతం మేర తగ్గిందని మంత్రి తెలిపారు. సీసీటీవీ కెమెరాలు, డ్రోన్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత విశ్లేషణ, డిజిటల్ నిఘా వ్యవస్థల ద్వారా ఇన్విజిబుల్ పోలీసింగ్ ను అమలు చేస్తూ నేరాలను ముందుగానే గుర్తించి నిరోధించే దిశగా ప్రభుత్వం విజయవంతంగా ముందుకు అడుగులు వేసిందన్నారు. నేరస్థుల కదలికలను పర్యవేక్షించడం, ఆధారాలను వేగంగా సేకరించడం, విచారణలను వేగవంతం చేయడం ద్వారా శిక్షల శాతం పెరిగేలా చర్యలు చేపట్టబడుతున్నాయన్నారు.

**మహిళల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం...** ఒక మహిళ అర్ధరాత్రి కూడా నిర్భయంగా వీధిలో నడవగలిగితేనే నిజమైన స్వాతంత్ర్యం సాధించినట్టే అనే భావనతో ప్రభుత్వం మహిళా భద్రతను అత్యంత ప్రాధాన్యతా అంశంగా తీసుకోవడం జరిగిందన్నారు. ఈ లక్ష్యంతో మహిళా రక్షణకు ప్రత్యేక విభాగాల ఏర్పాటు, ప్రతి జిల్లాలో ప్రత్యేక భద్రతా వ్యవస్థలు, సాంకేతిక ఆధారిత స్పందన

- 2లో

## జులై మూడో వారంలో తల్లికి వందనం!

- ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల పెంపునకు ప్రత్యేక చర్యలు
- జూన్ 29న షైనింగ్ స్టార్స్ కార్యక్రమం నిర్వహణ
- సెట్ లను సకాలంలో నిర్వహించండి
- రాష్ట్రానికి ఎన్ సీసీ స్టేట్ యూనిట్ మంజూరు
- విద్యాశాఖ అధికారులతో మంత్రి లోకేష్ సమీక్ష



**అమరావతి,కలంకౌంటర్ :** ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి తల్లికి వందనం పథకం కింద ఆర్థిక సాయం త్వరితగతిన అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. ఉండవల్లి నివాసంలో పాఠశాల విద్య, ఉన్నత విద్య అధికారులతో మంత్రి లోకేష్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లికి వందనం పథకం, బడి పిలుస్తోంది, షైనింగ్ స్టార్స్, మెగా పీటీఎం, యోగాంధ్ర, టెట్ నిర్వహణ అంశాలపై అధికారులు

- 2లో

## డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తో పెనుగొండ సుబ్బరాయుడు



**న్యూఢిల్లీ,కలంకౌంటర్ :** జనసేన పార్టీ తలపెట్టిన సేన ప్రస్థానం.. జాతీయ సమగ్రత కోసం ప్రత్యేక సమావేశం ఢిల్లీ వేదికగా జరిగింది. అనంతరం పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ పార్టీ పార్లమెంటు సభ్యులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, వివిధ కార్పోరేషన్ల ఛైర్మన్లు, ఇతర ప్రజాప్రతినిధులతో పాటు దక్షిణాది రాష్ట్రాలకు చెందిన 150 మంది ప్రతినిధులతో ఈ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జనసేన రాష్ట్ర నాయకుడు పెనుగొండ సుబ్బరాయుడు పాల్గొని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తో మర్యాదపూర్వకంగా కలిసి వివిధ అంశాలు మాట్లాడారు.

## వెలిగొండ నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ పరిహారం..

- అదనపు బడ్జెట్ లో 905 కేటాయించిన చంద్రబాబు.
- నల్లమలసాగర్ నింపడమే లక్ష్యంగా వెలిగొండ పనులు.
- టన్నెల్స్ లో లైనింగ్, టిబిఎం తొలగింపు ముమ్మరం.
- క్షేత్రస్థాయిలో పనులు పరిశీలించిన మంత్రి నిమ్మల రామానాయుడు.





**మార్కాపురం జిల్లా-డోర్నాల,కలంకౌంటర్ :** ఈనెలలో సిఎం చంద్రబాబు చేతుల మీదుగా వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ పరిహారం అందిస్తాం అని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. నల్లమలసాగర్ రిజర్వాయర్ లో నీళ్ళు నింపడానికి నిర్వాసితుల పునరావాసానికి అదనపు బడ్జెట్ లో 905 కోట్లు కేటాయించాం అని స్పష్టం చేశారు. మంగళవారం అధికారులతో కలసి డోర్నాల లో వెలిగొండ ప్రాజెక్టు జంట సొరంగాల్లోకి వెళ్ళి టన్నెల్ లైనింగ్, టన్నెల్ బోరింగ్ మెషిన్ తొలగింపు పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. వెలిగొండ ప్రాజెక్టు లో హెడ్ రెగ్యులేటర్ల రిటైనింగ్ వాల్, వింగ్స్, రిటర్న్స్ పనులు పూర్తి చేశాం అని తెలిపిన మంత్రి నిమ్మల కొల్లంవాగు నుండి 1 టిఎంసి నీరు టన్నెల్స్ లోకి చేరేలా 1.80లక్షల క్యూబిక్ మీటర్ల కు గానూ, ఇప్పటికి 58 వేల క్యూబిక్ మీటర్ల మక్ తొలగించాం అని, అదేవిధంగా టన్నెల్-1 లో నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న 1. 20 లక్షల క్యూబిక్ మీటర్ల మక్ తొలగింపు పనులలో ఇప్పటికి 40 వేల క్యూబిక్ మీటర్లు తొలగించాం అని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ 20 నెలలో టన్నెల్-2లో 7 కి.మీ లైనింగ్ కి గానూ, 5.5 కి.మీ లైనింగ్ పనులు పూర్తి చేశాం అని, మిగిలిన

- 2లో

## నమామి గంగే తరహాలో క్లీన్ గోదావరిని ప్రక్షాళన చేయండి

- స్వచ్ఛ గోదావరి పవిత్ర పుష్కరాల నిర్వహణకు సహకరించండి
- కేంద్ర జల శక్తి మంత్రి సి ఆర్ పాటిల్ ని కలసిన రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్
- గోదావరి కాలుష్య నివారణ, సవాళ్లపై చర్చ



- 3లో

# అవకాశాలకు నెలవు అమరావతి

- సరికొత్త ఆలోచనలతో రావాలని సీఎం చంద్రబాబు ఆహ్వానం
- సింగపూర్‌లో 'వరల్డ్ సిటీస్ సమ్మిట్'లో ముఖ్యమంత్రి ప్రసంగం
- సింగపూర్ పెవిలియన్, ఇన్నోవేటర్స్ అలే, గూగుల్ స్టాల్ సందర్శన





**సింగపూర్, కలంకౌంటర్ :** అంతర్జాతీయ మౌలిక వసతులతో నిర్మిస్తున్న రాజధాని అమరావతిలో అవకాశాలను అందిపుచ్చుకునేందుకు సరికొత్త ఆలోచనలతో రావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పెట్టుబడిదారులను ఆహ్వానించారు. సింగపూర్‌లో రెండవ రోజు పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి 'వరల్డ్ సిటీస్ సమ్మిట్' లీడర్ షిప్ ప్లీనరీ–2లో పాల్గొని 'కెన్ స్మార్ట్ సిటీస్ లవ్ హ్యూమన్స్' అనే అంశంపై ప్రసంగించారు. అమరావతిని నాలెడ్జ్ సిటీగా తీర్చిదిద్దుతున్నామని... జాతీయ, అంతర్జాతీయ విద్యాసంస్థలు వస్తున్నాయని సీఎం చెప్పారు. క్వాంటం కంప్యూటింగ్ హబ్, డిజిటల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ వంటివి అమరావతికి ప్రత్యేకత తీసుకువస్తాయని వివరించారు. అమరావతిని ప్రజా రాజధానిగా, ప్రపంచంలోనే అత్యుత్తమ నగరంగా నిర్మితమవుతోందని స్పష్టం చేశారు. ఈక్విటీ, నేచర్, ఆపర్చ్యునిటీ, లివబుల్ సిటీగా అమరావతి ఉంటుందన్నారు. 21 కి.మీ. కృష్ణానది పొడవునా వాటర్ ఫ్రంట్ నగరంగా అమరావతి రూపుదిద్దుకుంటోందని..., అలాగే ఇన్నర్ – ఔటర్ రింగ్ రోడ్లు, ఐకానిక్ బ్రిడ్జిలతో అద్భుతంగా నిలుస్తుందని చెప్పారు. స్పోర్ట్స్, ఫైనాన్సియల్, నాలెడ్జ్, జస్టిస్, టూరిజం, హెల్త్, మీడియా వంటి థీమ్ లతో అమరావతిని నిర్మిస్తున్నామని సీఎం తెలిపారు. సైక్లింగ్, వాకింగ్ ట్రాక్, గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్, అండర్ గ్రౌండ్ యుటిలిటీస్, గ్రీన్ ఎనర్జీ, నెట్ జీరో లక్ష్యంగా రాజధాని నిర్మాణం జరుగుతోందన్నారు. ప్రపంచంలో మరెక్కడా లేనివిధంగా ఒకే ఒక్క పిలుపుతో రాజధాని నిర్మాణం కోసం రైతులు 35 వేల ఎకరాలను అప్పగిస్తే... వాటిని అభివృద్ధి చేసి కొంత భాగాన్ని రైతులకు తిరిగి ప్లాట్లుగా ఇచ్చామని వివరించారు. 25 ఏళ్ల క్రితం తాను ఐటీ గురించి మాట్లాడానని... ఐటీ భవిష్యత్‌ను ఆరోజే ఊహించి ఫస్ట్ మూవర్ అడ్వాంటేజ్ తీసుకోవడంతో... ఇవాళ తెలుగువాళ్లు తలసరి ఆదాయంలో అందరికన్నా ముందున్నారని సీఎం అన్నారు. ఇప్పుడు ఏఐ గురించి ఆలోచన చేస్తున్నామన్నారు. నాడు తాను నిర్మించిన సైబరాబాద్... నేడు తెలంగాణకు ప్రధాన ఆదాయ వనరుగా మారిందన్నారు. సైబరాబాద్‌లో నాడు ఎకరం రూ.2 లక్షలు ఉంటే... నేడు ఎకరం రూ.200 కోట్లకు పెరిగిందన్నారు. అభివృద్ధి జరిగితే సంపద సృష్టి సాధ్యమవుతుందని చెప్పేందుకు సైబరాబాద్ నిదర్శనమని సీఎం వ్యాఖ్యానించారు. రాష్ట్ర విభజనతో మరోసారి కొత్త నగరాన్ని నిర్మించే అవకాశం తనకు లభించిందన్నారు. ప్రసంగం అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సింగపూర్ ఇన్నోవేషన్, టెక్నాలజీ ప్రదర్శన స్టాల్స్‌ను సందర్శించారు. సింగపూర్ పెవిలియన్‌లో ఏర్పాటు చేసిన అత్యాధునిక పట్టణాభివృద్ధి నమూనాలను సీఎం ఆసక్తిగా తిలకించారు. ఇన్నోవేటర్స్ అలేలో స్టార్టప్‌ల ఆవిష్కరణలను, గూగుల్ స్టాల్‌ను పరిశీలించారు. టెక్నాలజీ ఆధారిత పాలనలో సింగపూర్ అనుభవాలను తెలుసుకున్నారు.

# రెండేళ్లలో శాంతిభద్రతలు భేష్

- ప్రజా భద్రత, సైబర్ రక్షణ, విపత్తు నిర్వహణలో విశిష్ట పురోగతి - మంత్రి అనిత వంగలపూడి



యంత్రాంగం, శక్తి యాప్ ద్వారా అత్యవసర సహాయం మరియు మహిళలపై నేరాలకు ప్రత్యేక పర్యవేక్షణ అమలు చేయబడుతున్నదన్నారు. శక్తి యాప్ ద్వారా ఇప్పటివరకు 11.15 లక్షలకు పైగా అత్యవసర ఞాూ కాల్స్ అందాయని, వాటిపై తక్షణ చర్యలు కూడా తీసుకోవడం జరిగిందని మంత్రి తెలిపారు.

**ఆపరేషన్ ముస్కాన్ -- వేలాది కుటుంబాల్లో మళ్లీ ఆనందం...** తప్పిపోయిన చిన్నారులు, మహిళలు, వృద్ధులను గుర్తించి కుటుంబాలకు చేర్చేందుకు చేపట్టిన ఆపరేషన్ ముస్కాన్ అత్యంతంగా విజయవంతమైందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా 8,396 మంది తప్పిపోయిన వ్యక్తులను గుర్తించి, వారి కుటుంబాలకు తిరిగి చేర్చడం జరిగిందన్నారు. ఈ విజయాలు పోలీసు శాఖ మానవీయ కోణాన్ని ప్రతిబింబిస్తున్నదని మంత్రి తెలిపారు.

**చిన్నారుల రక్షణలో రాజీలేని వైఖరి...** పోక్సో కేసులను ప్రభుత్వం అత్యంత సున్నితమైన అంశంగా పరిగణిస్తూ చిన్నారులపై లైంగిక నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుచున్నదని మంత్రి తెలిపారు. ప్రత్యేక దర్యాప్తు బృందాలు, వేగవంతమైన ఫోరెన్సిక్ పరీక్షలు, ప్రత్యేక ప్రాసిక్యూషన్ వ్యవస్థ ఏర్పాటుతో పాటు బాధితులకు మానసిక, సామాజిక సహాయం అందించడం జరుగుచున్నదన్నారు. ఇప్పటివరకు 2,293 మంది చిన్నారులకు కౌన్సెలింగ్, పునరావాస సేవలు అందించబడ్డాయని తెలిపారు.

**సైబర్ నేరాలపై సాంకేతిక యుద్ధం...** డిజిటల్ యుగంలో పెరుగుతున్న సైబర్ నేరాలను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ప్రత్యేక వ్యూహాన్ని అమలు చేస్తోందన్నారు. సైబర్ వార్ రూమ్స్ ఏర్పాటు, బ్యాంకులు, టెలికాం సంస్థలతో సమన్వయం, 1930 సైబర్ హెల్ప్‌లైన్, ఆన్‌లైన్ మోసాలపై రియల్ టైమ్ స్పందన వంటి చర్యల ఫలితంగా సుమారు ?247 కోట్ల ప్రజల సొమ్మును మోసగాళ్ల బారిన పడకుండా రక్షించడం జరిగిందన్నారు. సైబర్ భద్రతపై అవగాహన కార్యక్రమాలు కూడా విస్తృతంగా నిర్వహించబడుతున్నాయన్నారు.

**అత్యవసర సేవల్లో వేగవంతమైన స్పందన...** ప్రజలకు అవసరమైన సమయంలో ప్రభుత్వం వారి వద్దకు చేరుకోవాలనే లక్ష్యంతో స్పందన వ్యవస్థను పూర్తిగా ఆధునీకరించడం జరిగిందన్నారు. 2024లో సగటున 30 నిమిషాలుగా ఉన్న స్పందన సమయం ప్రస్తుతం 10 నిమిషాల లోపుకు తగ్గిందని తెలిపారు. అత్యవసర సేవలలో 97.47 శాతం సమర్థవంతమైన స్పందన రేటు నమోదు కావడం విశేషం అన్నారు.

**ఫోరెన్సిక్ రంగంలో సమగ్ర పునర్నిర్మాణం...** శాస్త్రీయ దర్యాప్తుకు వెన్నెముకైన ఫోరెన్సిక్ వ్యవస్థను ప్రభుత్వం బలోపేతం చేస్తోందన్నారు. జనవరి నుండి మే వరకు 7,793 కేసులకు సంబంధించిన ఫోరెన్సిక్ విశ్లేషణలు పూర్తి చేయబడ్డాయన్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఫోరెన్సిక్ ప్రయోగశాలలను అభివృద్ధి చేస్తున్నామని మంత్రి తెలిపారు.


**రోడ్డు భద్రత -- ప్రాణనష్టాల తగ్గింపే లక్ష్యం...** రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రమాదకర ప్రాంతాల గుర్తింపు, అవగాహన కార్యక్రమాల నిర్వహణ, సీసీటీవీ పర్యవేక్షణ, ట్రాఫిక్ అమలు బలోపేతం తదితర చర్యలు చేపట్టడంతో ప్రమాదాల తీవ్రత తగ్గుముఖం పట్టిందని మంత్రి తెలిపారు.

**పోలీసు సంక్షేమంలో చారిత్రక నిర్ణయాలు...** పోలీసు సిబ్బంది సంక్షేమం లేకుండా సమర్థవంతమైన శాంతిభద్రతలు సాధ్యం కాదనే భావనతో ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుందన్నారు. 6,000 మందికి పైగా పోలీసు నియామకాలు, 505 మంది గెజిటెడ్ అధికారులకు పదోన్నతులు, కానిస్టేబుల్ శిక్షణార్థుల స్టైపెండ్‌ను ?4,000 నుండి ?7,500కు పెంపు చేయడం జరిగిందన్నారు. ఇందు కోసం ?7.5 కోట్ల అదనపు నిధుల కేటాయింపు చేయడం జరిగిందన్నారు.

**జైళ్లను సంస్కరణ కేంద్రాలుగా తీర్చిదిద్దుతున్న ప్రభుత్వం...** జైళు కేవలం శిక్షా కేంద్రాలు మాత్రమే కాకుండా పునరావాస కేంద్రాలుగా మారాలనే లక్ష్యంతో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, ఉపాధి శిక్షణ, మానసిక ఆరోగ్య సేవలు, డీ–అడిక్షన్ కేంద్రాలు ఏర్పాటు చేయబడ్డాయన్నారు. ఖైదీలు సమాజంలో గౌరవప్రదమైన జీవితాన్ని గడపడానికి అవసరమైన మార్గదర్శకత్వం అందించబడుతోందన్నారు.

**విపత్తు నిర్వహణలో దేశానికే ఆదర్శం...** గత రెండేళ్లలో విపత్తు నిర్వహణ వ్యవస్థను పూర్తిగా పునర్వ్యవస్థీకరించడం జరిగిందని మంత్రి తెలిపారు. 26 చీఱ=ఖీ బృందాలు, 22 ూణ=ఖీ బృందాలు, డ్రోన్ ఆధారిత పర్యవేక్షణ, ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు, రియల్ టైమ్ మానిటరింగ్ ద్వారా ప్రాణనష్టం తగ్గించే దిశగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. 872 మంది రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులకు ప్రత్యేక శిక్షణలు నిర్వహించబడ్డాయన్నారు. అదనపు డిజి మదుసూధన రెడ్డి, హోం శాఖ ప్రిన్సిఫల్ సెక్రటరీ కుమార విశ్వజిత్, ఎస్.పి.ఎఫ్. డిజి డా.త్రివిక్రమ వర్మ, హోం శాఖ స్పెషల్ సెక్రటరీ విజయకుమార్, ఈగల్ ఛీఫ్ ఐజి రవికృష్ణ, ఐజిలు శ్రీకాంత్, రాజకుమారి, విపత్తుల నిర్వహణ శాఖ ఎండి ప్రకర్ జైన్, అగ్నిమాపక శాఖ డైరెక్టర్ వెంకట రమణ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# జులై మూడో వారంలో తల్లికి వందనం!



(మొదటి పేజీ తరువాయి)

పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మంత్రికి వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికపై ఈ సందర్భంగా మంత్రి లోకేష్ ఆరా తీశారు. ప్రభుత్వ పాఠశాలల్లోకి విద్యార్థుల ప్రవేశాల పెంపు పై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా మంత్రి ఆదేశించారు. తల్లికి వందనం పథకానికి సంబంధించి.. తల్లుల ఆధార్ వెరిఫికేషన్ ప్రక్రియ త్వరలోనే పూర్తవుతుందని, జులై 3వ వారంలో పథకం అమలుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు వివరించారు. జూన్ 29న షైనింగ్ స్టార్స్ కార్యక్రమం, జులై మూడో వారంలో మెగా పీటీఎం నిర్వహణకు సమావేశంలో నిర్ణయించారు. మిగులు ఉపాధ్యాయుల పని సర్దుబాటుపైనా సమావేశంలో చర్చించారు.

**ఉన్నత విద్యాశాఖ అధికారులతో మంత్రి లోకేష్ సమీక్ష ..** రాష్ట్రంలో ఎప్ సెట్, పాలిసెట్, ఆర్ సెట్ వంటి 12రకాల కామన్ ఎంట్రన్స్ టెస్ట్ లకు ఎటువంటి జాప్యం లేకుండా సాధ్యమైనంత త్వరగా నోటిఫికేషన్లు విడుదల చేసి, నిర్ణీత సమయంలో అడ్మిషన్లు జరిగేలా చర్యలు తీసుకోవాలని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో నిర్వహించే సెట్స్, పొరుగు రాష్ట్రాల కామన్ ఎంట్రన్స్ టెస్ట్ ల తేదీలను కూడా గమనంలోకి తీసుకొని విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా రాష్ట్రంలోని వివిధ సెట్ ల తేదీలను ఖరారు చేయాలని అన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ కళాశాలల్లో సీట్ల పెంపును పరిశీలించాలని సూచించారు. పాలిటెక్నిక్ కళాశాలల్లో మెకానికల్, సివిల్ విభాగాల సీట్లకు డిమాండ్ ఉందని అధికారులు మంత్రి దృష్టికి తెచ్చారు. రాష్ట్రంలో ఇంజనీరింగ్ కు సంబంధించి 254 ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో 1.88లక్షల సీట్ల భర్తీకి గాను ఎప్ సెట్ నోటిఫికేషన్ కు సిద్ధంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రంలో యూనివర్సిటీల ఏర్పాటుకు ఆసక్తి చూపుతున్న థాపర్ ఇనిస్టిట్యూట్, జేమ్స్ కుక్ యూనివర్సిటీ, మెల్ బోర్న్ యూనివర్సిటీ, మేధావి స్కిల్ యూనివర్సిటీ, జేఎస్ఎస్ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ వంటి జాతీయ, అంతర్జాతీయ స్థాయి విద్యాసంస్థలతో చర్చల పురోగతిపై మంత్రి సమీక్షించారు. జీఎంఆర్ మాన్సాస్ ఏవియేషన్ యూనివర్సిటీ ఏర్పాటు ను వేగవంతం చేయాల్సిందిగా మంత్రి లోకేష్ ఆదేశించారు. రాష్ట్రంలో ఎన్‌సీసీ కార్యకలాపాలు, శిక్షణ, క్యాంపులు సమన్వయం చేయడానికి ఎన్‌సీసీ (చీజజ) స్టేట్ డైరెక్టరేట్'ను మంజూరు చేసిన కేంద్రప్రభుత్వానికి మంత్రి లోకేష్ ధన్యవాదాలు తెలిపారు. దేశంలో ఎన్‌సీసీ వ్యవస్థను బలోపేతం చేయడానికి, ఆంధ్రప్రదేశ్ యువతకు మరింత సైనిక శిక్షణ, ప్రోత్సాహం అందించడానికి ఈ ప్రత్యేక కేంద్రం ఉపకరించగలదని అన్నారు. ఈ సమావేశంలో విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి జే.శ్యామలరావు, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ తమీమ్ అన్సారియా, ఉన్నతవిద్య కమిషనర్ నారాయణ్ భరత్ గుప్తా, సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



**తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో వై.యస్.జగన్ ను కలిసిన మాజీ ఎంపీ మార్గాని భరత్ తో పాటు రాజమండ్రి కల్తీ పాల బాధితులు**

–తాడేపల్లి,కలంకౌంటర్ :

# పుంగనూరు నియోజకవర్గ టీడీపీ నేతలతో మంత్రి లోకేష్ భేటీ

## పార్టీ బలోపేతంపై చర్చ





**మంగళగిరి,కలంకౌంటర్ :** చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గ టీడీపీ నేతలు, కార్యకర్తలతో మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో టీడీపీ కార్యనిర్వాహక అధ్యక్షులు, విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్(సర్) ప్రక్రియపై మంత్రి పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతంపైనా సమావేశంలో చర్చించారు. త్వరలోనే పార్టీ సంస్థాగత కమిటీలను పూర్తిచేస్తామని చెప్పారు. కార్యకర్తలపై నమోదైన అక్రమ కేసుల ఎత్తివేతకు చర్యలు చేపడతామన్నారు. నియోజకవర్గంలో పార్టీ పరంగా తలెత్తుతున్న సమస్యలను ఈ సందర్భంగా నేతలు, కార్యకర్తలు మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకువచ్చారు. జోనల్ ఇంఛార్జ్, నియోజకవర్గ పరిశీలకులను పంపి సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. అనంతరం పార్టీ కార్యకర్తల నుంచి అర్జీలు స్వీకరించారు.

# ప్రత్యేక అధికారిగా ముప్పిరిశెట్టి హరనాథ్



**మోపిదేవి,కలంకౌంటర్ :** మోపిదేవి గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారిగా తహశీల్దార్ ముప్పిరిశెట్టి హరనాథ్ బాధ్యతలు చేపట్టారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక తహశీల్దారుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న హరనాథ్ మంగళవారం మోపిదేవి పంచాయతీ ప్రత్యేక అధికారిగా బాధ్యతలు చేపట్టారు. ప్రత్యేక అధికారిగా బాధ్యతలు చేపట్టిన హరనాథ్ కు పంచాయతీ కార్యదర్శి ఎల్ వెంకటేశ్వరరావు పూల బొకేలతో స్వాగతం పలికారు. గతంలో తహశీల్దారుగా మోపిదేవిలో పనిచేసిన హరనాథ్ తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. రెవిన్యూ సంబంధిత అర్జీలను త్వరితగతిన పరిష్కరిస్తూ, వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చిన ప్రజలతో సామరస్యంగా మాట్లాడి, వారి సమస్యలను పరిష్కరించేవారు. దీంతో మండల ప్రజలతో పాటు తోటి అధికారులు, నేతల అభిమానాన్ని చూరగొన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మోపిదేవి పంచాయతీ ప్రత్యేక అధికారిగా బాధ్యతలు చేపట్టినట్లు హరనాథ్ తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వో బొడ్డు శ్రీనివాసరావు, మోపిదేవి నాగేశ్వరరావు, నవీన్, మురళి తదితరులు పాల్గొన్నారు.

# ఏలూరు లాకుల వద్ద 'వన్ వే' నిబంధన

- నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు:
- సత్యనారాయణపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ





**విజయవాడ,కలంకౌంటర్ :** విజయవాడ రైల్వే స్టేషన్ పరిసరాల్లో ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు సత్యనారాయణపురం పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. నిత్యం వేలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగించే ఏలూరు లాకుల వద్ద కొత్తగా 'వన్ వే' బోర్డులను ఏర్పాటు చేశారు. సత్యనారాయణపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ఈ మార్గంలో నిబంధనలు ఉల్లంఘించి ప్రయాణిస్తున్న వాహన చోదకులకు ప్రత్యేక కౌన్సిలింగ్ నిర్వహించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో భాగంగా చేపట్టిన ఈ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని, ఇకపై వన్ వే మార్గంలో వచ్చే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

# వెలిగొండ నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ పరిహారం..

- అదనపు బడ్జెట్ లో 905 కేటాయించిన చంద్రబాబు.
- టన్నెల్స్ లో లైనింగ్, టిబిఎం తొలగింపు ముమ్మరం.
- క్షేత్రస్థాయిలో పనులు పరిశీలించిన మంత్రి నిమ్మల రామానాయుడు.

(మొదటి పేజీ తరువాయి)

1.5 కి.మీ లైనింగ్, జూలై చివరి నాటికి పూర్తి చేసేలా పనులు జరుగుతున్నాయి స్పష్టం చేశారు. 5 ఏళ్ళ వైసిపి పాలనలో హైకోర్టు ఆదేశాలతో టన్నెల్–2 లో చిక్కుకుపోయిన టన్నెల్ బోరింగ్ మెషిన్ వెలికితీత పనులు చేపట్టి, మొత్తం 7 కంపార్ట్మెంట్ లలో ఇప్పటికి 3 కంపార్ట్ మెంట్లు బయటకు తీసుకొచ్చాం అని టన్నెల్ బోరింగ్ మెషిన్ లో క్లిష్టమైన హెడ్ ను అక్కికక్కడే టన్నెల్ లోనే పూడ్చిపెట్టడానికి అవకాశాలు పరిశీలిస్తున్నాం అని పేర్కొన్నారు. ఫీడర్ కెనాల్ లో 5.3 కి.మీ రిటైనింగ్ వాల్ పనులు, జనవరిలో ప్రారంభించి నేటికి 5 నెలల్లో పూర్తి చేశాం అని తెలిపిన మంత్రి నిమ్మల, నత్తనడకన సాగుతున్న 21 కి.మీ లైనింగ్ పనులు వేగవంతం చేయాలని అధికారులు, ఏజెన్సీ ప్రతినిధులను ఆదేశించారు. మెంధా తుఫాన్ కారణంగా ఫీడర్ కెనాల్ లో పడిన భారీ గండికి సిసి వాల్ నిర్మించి పూర్తి చేయ-ంబోతున్నాం అని అన్నారు. తీగలేరు, ఈస్టర్న్ మెయిన్ కెనాల్స్ తో పాటు పర్మనెంట్ డైవర్షన్ రోడ్డు పనులు సైతం జూన్ నెలాఖరు నాటికి పూర్తికానున్నాయి అని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల ప్రకారం, సీజన్ మొదలయ్యే నాటికి నల్లమలసాగర్ రిజర్వాయర్ నింపేలా పనులు జరుగుతున్నాయి అని తెలిపారు. వైసీపీ నాయకులు వెలిగొండ కు బడ్జెట్ లో నిధులు కేటాయుంచడం లేదు అంటూనే వెనుకబడిన ప్రకాశం జిల్లా ప్రజలకు తమ గొడ్డలి పార్టీ నాయకుడు చేసిన మోసాన్ని ఒప్పుకున్నారని అన్నారు. 5ఏళ్లలో నిర్వాసితులకు ఒక్క రూపాయి కూడా కేటాయించకుండా వారిని ఇబ్బంది పెట్టారని, కూటమి ప్రభుత్వం అదనపు బడ్జెట్ లో నిధులు కేటాయుంచి వారికి అండగా నిలబడ్డామని స్పష్టం చేశారు. జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తో పాటు మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి, యర్రగొండపాలెం టిడిపి నియోజకవర్గం ఇంచార్జ్ ఎరిక్షన్ బాబు, జలవనరుల శాఖ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, వెలిగొండ ప్రాజెక్ట్ సీఈ రమేష్ బాబు, ఎస్.ఈ అబూతలేం, మరియు ఇతర ఉన్నతాధికారులు, ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఏపీ రైల్వే అభివృద్ధికి రూ.10,144 కోట్లు

● రాయనపాడు శాటిలైట్ స్టేషన్‌కు రూ.35 కోట్లతో ఆధునిక హంగులు ● అమరావతిని దేశ ప్రధాన నగరాలతో అనుసంధానం చేస్తాం ● కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి



**విజయవాడ,కలంకౌంటర్** : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశ రైల్వే రంగం విప్లవాత్మక మార్పులను చవిచూస్తోందని, వికసిత భారత్ లక్ష్య సాధనలో రైల్వేలు కీలక శక్తిగా మారాయని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి పేర్కొన్నారు. విజయవాడ సమీపంలోని రాయనపాడు శాటిలైట్ రైల్వే స్టేషన్‌ను సోమవారం సందర్శించిన ఆయన, స్టేషన్‌లో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రహ్లాద్ జోషి మాట్లాడుతూ రాయనపాడు శాటిలైట్ రైల్వే స్టేషన్ అభివృద్ధికి రూ.35 కోట్లను ఖర్చు చేసినట్లు తెలిపారు. ప్రయాణికులకు అత్యాధునిక సౌకర్యాలు కల్పిస్తూ రైల్వే మౌలిక వసతులను దేశవ్యాప్తంగా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. గత 12 సంవత్సరాలుగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని పేర్కొన్నారు.

**దేశవ్యాప్తంగా విస్తరించిన నెట్వర్క్..** దేశంలో ప్రస్తుతం 1.05 లక్షల కిలోమీటర్లకు పైగా రైల్వే నెట్‌వర్క్ ఉందని, దీనిని పూర్తిస్థాయిలో విద్యుదీకరించే కార్యక్రమం వేగంగా సాగుతోందని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు. విద్యుదీకరణ చేపట్టకపోతే దేశం లక్షల కోట్ల లీటర్ల డీజిల్ దిగుమతులపై ఆధారపడాల్సి వచ్చేదని తెలిపారు. పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగాన్ని పెంచుతూ సౌరశక్తిని సమర్థవంతంగా వినియోగించడంలో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పారు.

**ఏపీకి పెద్ద ఎత్తున నిధులు..** ఆంధ్రప్రదేశ్‌లో రైల్వే మౌలిక వసతుల అభివృద్ధికి 2026--27 ఆర్థిక సంవత్సరానికి రూ.10,144 కోట్లను కేటాయించినట్లు కేంద్ర మంత్రి ప్రహ్లాద జోషి వెల్లడించారు. రాష్ట్రంలో కొత్త రైల్వే లైన్లు, స్టేషన్ల ఆధునికీకరణ, ప్రయాణికుల సౌకర్యాల మెరుగుదల, సరుకు రవాణా సామర్థ్యాల పెంపు వంటి కార్యక్రమాలు వేగంగా అమలవుతున్నాయని పేర్కొన్నారు. అమరావతి రాజధాని అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేసిన ఆయన, ప్రధాని మోదీ నాయకత్వంలో అమరావతిని రాజధానిగా గుర్తిస్తూ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసిన విషయాన్ని గుర్తుచేశారు. భవిష్యత్తులో దేశంలోని ప్రధాన నగరాలను అనుసంధానించే కీలక రైల్వే మార్గాలు అమరావతికి అందుబాటులోకి వస్తాయని తెలిపారు. దీంతో రాజధాని ప్రాంత అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని అన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లతో కలిసి కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలను సమన్వయంతో ముందుకు తీసుకెళ్తోందని ప్రహ్లాద్ జోషి పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో . ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు అడ్డూరి శ్రీరామ్ బీజేపీ నేతలు షేక్ బాజీ , మట్టా ప్రసాద్, ఉప్పలపాటి శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు..

# నమామి గంగే తరహాలో క్లీన్ గోదావరిని ప్రక్షాళన చేయండి

● స్వచ్ఛ గోదావరి పవిత్ర పుష్కరాల నిర్వహణకు సహకరించండి ● కేంద్ర జల్ శక్తి మంత్రి సి ఆర్ పాటిల్ ని కలసిన రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ● గోదావరి కాలుష్య నివారణ, సవాళ్లపై చర్చ



**న్యూఢిల్లీ,కలంకౌంటర్** : నమామి గంగే ప్రాజెక్టు తరహాలో క్లీన్ గోదావరి నది ప్రాజెక్టుని చేపట్టి గోదావరి నది ప్రాశస్త్యాన్ని కాపాడేలా కేంద్ర తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రివర్యులు, అటవీ పర్యావరణ శాఖల మంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారు కేంద్ర జల్ శక్తి మంత్రి శ్రీ సి.ఆర్. పాటిల్ గారిని కోరారు. వచ్చే ఏడాది జరగబోయే గోదావరి పుష్కరాలను స్వచ్ఛ గోదావరి పవిత్ర పుష్కరాలు థీమ్ తో చేపడుతున్నామని చెప్పారు. దీనికి అనుగుణంగా గోదావరిని స్వచ్ఛంగా మార్చేందుకు కేంద్రం అందించే సహకారం చాలా అవసరం అన్నారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా మంగళవారం మధ్యాహ్నం కేంద్ర జల్ శక్తి మంత్రివర్యులు శ్రీ సి.ఆర్ పాటిల్ గారితో శ్రీ పవన్ కళ్యాణ్ గారు సమావేశం అయ్యారు. అనంతరం మీడియాతో శ్రీ పవన్ కళ్యాణ్ గారు మాట్లాడుతూ "గోదావరి పుష్కరాలకు దేశం నలుమూలల నుంచి కోట్లాది మంది వస్తారు. వారికి గోదావరినది గొప్పతనం తెలిపేలా, నదిని అత్యంత శుభ్రంగా ఉంచాలన్నది కూటమి ప్రభుత్వ ఆలోచన. అయితే గోదావరి నది కాలుష్యం, శుద్ధి చేయని నీరు ప్రత్యక్షంగా నదిలో కలవడం వంటి సవాళ్లు ముడిపడి ఉన్నాయి. వీటిని అధిగమించేందుకు కేంద్రం తగిన విధంగా సహకారం అందించాలి. మున్సిపాలిటీల్లో నీటి శుద్ధి కేంద్రాలను మరిన్ని నిర్మించి మురుగు నీటిని గోదావరిలో కలవకుండా నివారించాల్సిన అవసరం ఉంది. దీనిపై కేంద్ర మంత్రివర్యులతో సుదీర్ఘంగా చర్చించాం. ఎక్కడి నుంచి కాలుష్యం అధికంగా ఉంది.. నివారణ చర్యలు ఎలా తీసుకోవాలి అనే అంశాలను చర్చించాం. ఘన, ద్రవ వ్యర్థాలు గోదావరిలో ప్రత్యక్షంగా కలవకుండా ఎలా నివారించాలి అన్న అంశాలను మంత్రివర్యుల దృష్టికి తీసుకువెళ్లాం. పుష్కరాలకు ముందే గోదావరి కాలుష్యాన్ని నివారించే చర్యలు తీసుకుంటాం. దీనికి కేంద్రం కూడా తగిన విధంగా సహకరిస్తుంది కేంద్ర మంత్రివర్యులు హామీ ఇచ్చారు. పుష్కరాలను కాలుష్య రహితంగా ఎలా నిర్వహించవచ్చు అన్న అంశాలతో మంత్రి గారికి నివేదిక రూపంలో అందించాం. కేంద్ర మంత్రి ఆ నివేదికను పరిశీలించి కూటమి ప్రభుత్వ విజన్ ను అభినందించారు. పుష్కరాల నిమిత్తం మోడల్ పంచాయతీల అభివృద్ధి, భక్తుల రద్దీ నియంత్రణ, సౌకర్యాల కల్పన అంశాలలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రణాళికలు అద్భుతంగా ఉన్నాయని కేంద్ర మంత్రివర్యులు ప్రశంసించారు. గతంలో సూరత్, వారణాసి, ప్రయాగ్ రాజ్ లలో నిర్వహించి మహాకుంభ్ లో చేసిన ఏర్పాట్లు, భక్తుల రద్దీ నియంత్రణ తరహా మోడల్ ను వచ్చే పుష్కరాల్లో అమలు చేసే విధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి సహకరించాలని కోరాం. జల్ జీవన్ మిషన్ కు కేంద్రం నుంచి మరింత సహకారం అందించాలని కోరాము"ని అన్నారు.

# నగర పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత..

## -కమిషనర్ (ఎఫ్.ఏ.సి.) శారదా దేవి.





**తిరుపతి,కలంకౌంటర్** : మన ఇంటితోపాటు నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత మనందరిపైన ఉందని నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్.ఏ.సి.) శారదా దేవి అన్నారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ లో భాగంగా మంగళవారం నగరంలోని ఉపాధ్యాయ నగర్, రాయల్ నగర్ తదితర ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను కమిషనర్ పరిశీలించారు. ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ క్లీన్ స్వీప్ లో భాగంగా నగరంలోని అన్ని వార్డుల్లో పారిశుద్య పనులు చేపడుతున్నామని తెలిపారు. ఉపాధ్యాయ నగర్ సమీపంలోనికి ఇటీవల చిరుత పులి వచ్చిందని తెలిపారని అన్నారు. ఆహార వ్యర్థాలు రోడ్లపక్కన పడేయడం వలన కుక్కలు, వన్యప్రాణులు వస్తున్నాయని తెలిపారు. వీటి కొరకు చిరుతలు వస్తున్నాయని తెలిపారు. కావున వ్యర్థాలను రోడ్లపక్కన, కాలువల్లో వేయవద్దని తెలిపారు. రాయల్ నగర్లో ప్రజలు పలు సమస్యలను వివరించారని వాటిని పరిష్కరిస్తామని తెలిపారు. రాయల్ నగర్ నందు పడిపోయేందుకు సిద్ధంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమం లో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, మునిసిపల్ ఇంజనీర్ తులసి కుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డి.ఈ.మహేష్, శానిటరీ సూపర్ వైజర్లు చెంచయ్య, సుమతి, స్వర్ణ వార్డు కార్యదర్శులు, పారిశుద్య సిబ్బంది. తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ యోగా దినోత్సవ ఏర్పాట్ల పరిశీలన

## -జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ





**విజయవాడ,కలంకౌంటర్** : జూన్ 21న విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తుందని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథులుగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ప్రముఖ యోగా గురువు బాబా రాందేవ్ బాబా లు హాజరు కానున్న నేపథ్యంలో చేపడుతున్న ఏర్పాట్లను మంగళవారం జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు కే.ఎస్. విశ్వనాథన్, నగర మున్సిపల్ కమిషనర్ హెచ్.ఎమ్ ధ్యానచంద్ర, నగర డీసీపీ కృష్ణకాంత్ పటేల్, ఏడీసీపీ ఎన్బీఎమ్ మురళీ కృష్ణ, సెకండరీ హెల్త్ డైరెక్టర్ కేవీఎన్ చక్రధర్ బాబు, ప్రభుత్వ సలహాదారు మంతెన వెంకట సత్యనారాయణ రాజు, ప్రకృతి వైద్య ప్రభుత్వ సలహాదారు మంతెన సత్యనారాయణ రాజు, యోగా గురువు బాబా రాందేవ్ ప్రతినిధులు, జిల్లా అధికారులతో కలిసి ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం డా. బీఆర్. అంబేద్కర్ కళా వేదికకు చేరుకుని అక్కడ చేస్తున్న ఏర్పాట్లు, ప్రొటోకాల్ తదితర అంశాలపై వారితో కలెక్టర్ చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ మాట్లాడుతూ... దాదాపు 5 వేల మందికిపైగా యోగా సాధకులు, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా తాగు నీరు, వైద్య సేవలు వంటి తగిన ఏర్పాట్లను చేస్తున్నామన్నారు. పారిశుధ్యం, విద్యుత్, ట్రాఫిక్ నియంత్రణ, భద్రత తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. మున్సిపల్, పోలీసు, రెవెన్యూ, ఆయుష్ తదితర శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లను వేగవంతంగా పూర్తి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రత్యామ్నాయంగా డా. బీఆర్ అంబేద్కర్ కళా వేదికలోనూ యోగా నిర్వహించేలా ఏర్పాట్లను సిద్ధం చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఇందుకోసం అక్కడ కూడా అవసరమైన అన్ని సౌకర్యాలను ముందుగానే ఏర్పాటు చేస్తున్నామన్నారు. శాఖల సమన్వయంతో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు విజయవంతం చేసేందుకు యోగాలో పాల్గొనే ప్రతి ఒక్కరికీ సౌకర్యవంతమైన వాతావరణాన్ని కల్పిస్తున్నామని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ తెలిపారు.

# అమర్నాథ్ గౌడ్‌ను స్మరించుకున్న కావలి టీడీపీ.. భావోద్వేగ నివాళులు



**కావలి,కలంకౌంటర్** : బాపట్ల జిల్లా రేపల్లె నియోజకవర్గంలో మూడు సంవత్సరాల క్రితం జరిగిన అమర్నాథ్ గౌడ్ హత్య ఘటనను స్మరించుకుంటూ మంగళవారం కావలి టీడీపీ కార్యాలయంలో టీడీపీ నాయకులునివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అమర్నాథ్ గౌడ్ చిత్రపటానికిపూలమాలలు వేసిఘనంగానివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడిన టీడీపీ నాయకులు, "మా అక్కను ఎందుకు వేధిస్తున్నారు?" అని ప్రశ్నించిన పదో తరగతి విద్యార్థి అమర్నాథ్ గౌడ్‌ను వైసీపీ నేతలు పెట్రోల్ పోసి తగలబెట్టి హత్య చేశారని ఆరోపించారు. ఈ దారుణ ఘటనకు నేటితో మూడేళ్లు పూర్తవుతున్నప్పటికీ బాధిత కుటుంబానికి పూర్తి న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అమర్నాథ్ గౌడ్ హత్య కేసులో నిందితులుగా ఉన్న ముగ్గురు వ్యక్తులు బెయిల్‌పై బయటకు వచ్చి స్వేచ్ఛగా తిరుగుతున్నారని, బాధిత కుటుంబ సభ్యులు మాత్రం ఇప్పటికీ భయాందోళనల మధ్య జీవిస్తున్నారని పేర్కొన్నారు. బాధిత కుటుంబాన్ని బెదిరించడం,హత్యాయత్నాలకు పాల్పడడంవంటి ఘటనలు కూడా చోటుచేసుకున్నాయని వారు ఆరోపించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అనేక దారుణ సంఘటనలు జరిగాయని, సాధారణ ప్రజలకు రక్షణ లేకుండా పోయిందని టీడీపీ నాయకులు విమర్శించారు. కారు డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసు, వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు వంటి సంఘటనలను ప్రస్తావిస్తూ, అప్పటి పాలనలో చట్టవ్యవస్థబలహీనపడిందని ఆరోపించారు. . ఈ కార్యక్రమంలో కావలి టీడీపీ అధ్యక్షుడు గుత్తికొండ కిషోర్, ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబు, మాజీ సోమశిల చైర్మన్ కండ్లగుంట మధుబాబు నాయుడు, పట్టణ ఉపాధ్యక్షుడు దేవరకొండ శ్రీను, సీనియర్ నాయకుడు బాల గురుస్వామి, ఏరియా వైద్యశాల డైరెక్టర్ ఏటూరి శివ, 6వ వార్డు ఇంచార్జ్ జంపాని ప్రసాద్‌తో పాటు పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# యోగాంధ్రలో ఏపీయూడబ్ల్యూజే



**వినాయవాడ,కలంకౌంటర్** : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న యోగాంధ్ర కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఏపీయూడబ్ల్యూజే) భాగస్వామ్యం అయింది. మంగళవారం నాడు భవానిపురంలోని బెరం పార్క్ లో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమానికి ఏపీయూడబ్ల్యూజే నాయకులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మి షా పిలుపుమేరకు ఏపీయూడబ్ల్యూజే, అనుబంధ సంఘాలైన విజయవాడ ప్రెస్ క్లబ్, ఎలక్ట్రానిక్ మీడియా, చిన్న పత్రికల సంఘం, ఫోటోగ్రాఫర్ల అసోసియేషన్ నాయకులు పెద్ద ఎత్తున యోగేంద్ర కార్యక్రమంలో భాగస్వాములయ్యారు .ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కంచల జయరాజ్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న యోగాంధ్ర కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజే, దాని అనుబంధ సంఘాలు భాగస్వాములు అవుతున్నాయని గుర్తు చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ ,రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని చేపట్టే కార్యక్రమాలకు ఏపీయూడబ్ల్యూజే, అనుబంధ సంఘాలు పూర్తిస్థాయిలో మద్దతు ప్రకటిస్తూ భాగస్వాములు అవుతున్న విషయాన్ని గుర్తు చేశారు. మనిషి సంపూర్ణ ఆరోగ్యంగా, ఆనందంగా ఉండటానికి యోగ సాధన ఎంతో ఉపకరిస్తుందని అంశాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు .నిత్యం పని ఒత్తిడిలో ఉంటూ రకరకాల ఆందోళనలతో వృత్తి జీవితాన్ని గడుపుతున్న జర్నలిస్టులకు యోగ సాధన అత్యుత్తమమైన రిలీఫ్ గా పని చేస్తుందని సూచించారు .ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే, అనుబంధ సంఘాలను కూడా భాగస్వామ్యం చేయటం పట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మి షా కు కృతజ్ఞతలు తెలిపారు .యోగాంధ్ర కార్యక్రమాలే కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే అనేక ప్రజాహిత ,సంక్షేమ కార్యక్రమాలను ఏపీడబ్ల్యూజే అనుబంధ సంఘాలు ప్రజల్లోకి తీసుకెళ్లే విషయంలో ముందు వరుసలో ఉంటున్నాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షులు చావా రవి, సామ్నా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ రమణారెడ్డి, కార్యవర్గ సభ్యులు సురేష్, సీనియర్ జర్నలిస్ట్ శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు

# ఆక్వా రైతులను ఆదుకుంటున్నది ఎన్డీఏ ప్రభుత్వమే..

● రాజకీయ లబ్ధి కోసమే గొడ్డలి పార్టీ విమర్శలు ● రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు మంత్రి అచ్చెన్నాయుడు



**పార్వతీపురం/అమరావతి,కలంకౌంటర్** :ఆక్వా రంగాన్ని అస్తవ్యస్తం చేసి, ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్న గొడ్డలి పార్టీకి వాస్తవాలు మాట్లాడే అర్హత లేదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ధ్వజమెత్తారు. పార్వతీపురం మన్యం జిల్లాలో సమీక్షా సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ప్రతి చిన్న విషయాన్ని రాజకీయ కోణంలో చూస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించడం గొడ్డలి పార్టీ అధ్యక్షుడికి వెన్నతో పెట్టిన విద్య అని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఫీడ్ తయారీ సంస్థలు ఏకపక్షంగా ధరలు పెంచేందుకు ప్రయత్నించినప్పుడు, ప్రభుత్వం కఠినంగా వ్యవహరించి ఆ ప్రక్రియను వెంటనే నిలిపివేసిందని మంత్రి స్పష్టం చేశారు. "రైతులపై భారం మోపే ఏ ప్రయత్నాన్ని ఈ ప్రభుత్వం ఉపేక్షించదు. విజయవాడలో ఏపిడా ఆధ్వర్యంలో సుదీర్ఘ సమావేశం నిర్వహించి, ప్రపంచవ్యాప్త ముడి పదార్థాల ధరల పెరుగుదల వల్ల కలిగిన ఇబ్బందులను రైతులకు, యాజమాన్యాలకు వివరించాం. ధరల విషయంలో పారదర్శకత ఉండాలని, ఏ నిర్ణయం తీసుకున్నా రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకునే జరగాలని తేల్చిచెప్పాం" అని ఆయన పేర్కొన్నారు.

**అబద్ధపు ప్రచారానికి చెక్..** గత ప్రభుత్వ హయాంలో విద్యుత్ సబ్సిడీ పేరుతో జరిగిన మోసాలను మంత్రి ఎండగట్టారు. "అప్పుడు ఎన్నికల ముందు అందరికీ రూపాయిన్నరకు విద్యుత్ ఇస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక జోన్, నాన్‌జోన్ అంటూ రైతుల మధ్య చిచ్చు పెట్టారు. కానీ, నేడు ఎన్డీఏ ప్రభుత్వం ఎలాంటి పరిమితులు లేకుండా ప్రతి రైతుకూ రూపాయిన్నరకే విద్యుత్ అందిస్తోంది. గత ప్రభుత్వం 57 నెలల్లో రూ. 3,300 కోట్లు ఇస్తే, మేము ఒక్క సంవత్సరంలోనే రూ. 1,170 కోట్ల సబ్సిడీని నేరుగా రైతుల ఖాతాల్లోకి చేరుస్తున్నాం. ఇది కదా రైతు పక్షపాత ప్రభుత్వం అంటే?" అని సవాల్ విసిరారు. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన ల్యాబ్‌లన్నీ కేవలం బోర్డులకే పరిమితమని, రాష్ట్రంలో ఎక్కడా ఒక్క ల్యాబ్ కూడా పూర్తిస్థాయిలో పనిచేయడం లేదని అచ్చెన్నాయుడు ఆరోపించారు. "ఏ గ్రామానికి రమ్మన్నా వస్తా.. అక్కడ ఒక్క పని చేసే ల్యాబ్ చూపిస్తే నా పదవికి రాజీనామా చేస్తా. మీది అబద్ధాల పునాదుల ప్రభుత్వం, మాది వాస్తవాల ప్రభుత్వం" అని ఆయన నిప్పులు చెరిగారు. రొయ్యల ఫీడ్ ధరల నిర్ణయంలో రైతుల ప్రమేయం ఉండాలన్నదే తమ లక్ష్యమని మంత్రి వివరించారు. ఈ మేరకు ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తూ జీవో జారీ చేసిందని, అందులో రైతులు, తయారీదారులు, ప్రభుత్వ అధికారులు ఉంటారని చెప్పారు. ఇకపై ధరల పెరుగుదలైనా, తగ్గుదలైనా చర్చల ద్వారానే జరుగుతుందని స్పష్టం చేశారు. "రాజకీయాల కోసం రైతుల ఉసురు తీసుకోవద్దు. ప్రభుత్వం తీసుకుంటున్న సంస్కరణలను చూసి ఓర్వలేక విమర్శించడం మానుకోండి. నిజాలు మాట్లాడటం నేర్చుకోండి" అని గొడ్డలి పార్టీ అధ్యక్షుడు ఉద్దేశించి మంత్రి తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు.

# అమర్నాథ్ గౌడ్ కు ఘన నివాళులు



**కందుకూరు,కలంకౌంటర్** : మా అక్కను ఎందుకు వేధిస్తున్నారు ?.... అని ప్రశ్నించిన తమ్ముడు అమర్నాథ్ గౌడ్ ను (10వ తరగతి)... వైసీపీ నేతలు పెట్రోల్ పోసి తగలబెట్టి చంపేశారు. బాపట్ల జిల్లా రేపల్లె నియోజకవర్గంలో జరిగిన ఈ సంఘటనకు నేటితో మూడేళ్లు పూర్తయ్యాయి. జగన్ పాలనలో జరిగిన ఎన్నో దారుణాలలో ఇదొకటి. ఈ ఘటనను గుర్తు చేసుకుంటూ.. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరావు ఆదేశాలతో... మంగళవారం కందుకూరులోని టీడీపీ కార్యాలయంలో, ఆ పార్టీ నాయకులు, అమర్నాథ్ గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. టిడిపి నేతలు మాట్లాడుతూ... అమర్నాథ్ గౌడ్ ను ముగ్గురు వైసీపీ నేతలు కలిసి దారుణంగా చంపారని, బాధితులు దుఃఖంలో మునిగిపోయి ఉంటే.... నిందితులు బెయిల్ పై విడుదలై దర్జాగా తిరుగుతున్నారని అన్నారు. వినాయక చవితి ఉత్సవాల్లో ఉత్సాహంగా డ్యాన్సులు చేస్తూ శాడిస్టుల్లాగా ప్రవర్తించారని గుర్తు చేశారు. పైగా పాము వెంకటేశ్వర్ రెడ్డి అనే నిందితుడు.... బాధిత కుటుంబాన్ని చంపేస్తామంటూ బెదిరించారని, అర్ధరాత్రి ఇంట్లోకి వెళ్లి హత్యాయత్నం కూడా చేశారని తెలిపారు. వైసిపి పాలనలో.. ఎమ్మెల్సీ అనంత బాబు కారు డ్రైవర్ ను చంపి డోర్ డెలివరీ చేసిన విషయాన్ని నేతలు ప్రస్తావించారు. వైయస్ వివేకానందరెడ్డిని హత్య చేసిన నిందితులకు జగన్ కొమ్ము కాస్తూ, హత్య కేసును పక్కదారి పట్టించే ప్రయత్నం చేశాడని విమర్శించారు. చెప్పుకుంటూ పోతే ఇలాంటివి ఎన్నో జగన్ పాలనలో, నా బీసీలు.. నా ఎస్సీలు .. నా ఎస్టీలు... అంటూ ప్రతిచోటా జగన్ ఊదరగొట్టి అధికారంలోకి వచ్చిన జగన్, వారందరినీ మోసం చేశారని టీడీపీ నేతలు విమర్శించారు. చంద్రబాబు నాయుడు గారి నేతృత్వంలోని కూటమి ప్రభుత్వ పాలనలో శాంతి భద్రతలు అదుపులో ఉన్నాయని, ఎలాంటి నేరం జరిగినా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని నేతలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ చిలకపాటి మధు, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు ముచ్చు శ్రీను, మాజీ కౌన్సిలర్ మహర్షి శ్రీను, పార్టీ నేతలు గుమ్మా శివ, గుమ్మడి బ్రహ్మయ్య, భవనాసి వెంకటేశ్వర్లు, నీలిశెట్టి శివరామకృష్ణ, యనమల కనకరాజు, మొనపాటి సుబ్బరాజు, మోసంగి ప్రసాద్, గొల్లప్రోలు కొండలరావు, మోహనరావు, చుండూరి శ్రీను, పలువురు బీసీ నేతలు పాల్గొన్నారు.

# జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వెలంపల్లి



**విజయవాడ,కలంకౌంటర్ :** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి జన్మదినం సందర్భంగా తాడేపల్లిలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో వారిని కలిసి శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన మాజీ మంత్రి, విజయవాడ పశ్చిమ వైసీపీ ఇంచార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు .

# వెన్నుపోటుదారుడు జగనే

● రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ● ఏపీకి భవిష్యత్తు కూటమితోనే... ● గర్వపడేలా సీఎం చంద్రబాబు రెండేళ్ల పాలన ● ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకున్నాం ● రాష్ట్రంలో అభివృద్ధిని, సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తున్నాం ● గ్రామాల్లో సైతం భారీ ఎత్తున రోడ్ల నిర్మాణం ● వైసీపీ హయాంలో నిద్రపోయిన పీఆర్ శాఖ ● అభివృద్ధిపై దమ్ముంటే చర్చకు రావాలి ● జగన్ కు, వైసీపీ నాయకులకు మంత్రి సవిత సవాల్

**పుట్టపర్తి/శ్రీసత్యసాయి,కలంకౌంటర్ :** ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్రంలో విధ్వంస పాలనతో ప్రజల నమ్మకాన్ని వమ్ము చేసి చరిత్రలో వెన్నుపోటు దారుడిగా నిలిచిపోయారని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత విమర్శించారు. కూటమి ప్రభుత్వంతోనే ఏపీ ప్రజల భవిష్యత్తుకు భరోసా లభిస్తోందని, రాష్ట్రాన్ని అన్ని రంగాల్లోనూ సీఎం చంద్రబాబునాయుడు అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని కొనియాడారు. కూటమి ప్రభుత్వ పాలనలో జరుగుతున్న అభివృద్ధిపైనా, గత పాలనలో జరిగిన విధ్వంసంపైనా చర్చకు సిద్ధమని వైసీపీ నాయకులకు మంత్రి సవిత సవాల్ విసిరారు. పుట్టపర్తిలో మంగళవారం నిర్వహించిన రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్ యాదవ్, ప్రభుత్వ విప్ కాల్వ శ్రీనివాసులు సహా పలువురు ఎమ్మెల్యేలు ఎమ్మెస్ రాజు, పరిటాల సునీత, పల్లె సింధూర రెడ్డి, ఎంపీ బీకే పార్థసారథితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీనీ నెరవేరుస్తూ, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో సీఎం చంద్రబాబునాయుడు ఏపీని దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టడానికి రేయింబవళ్లు కృషి చేస్తున్నారని కొనియాడారు. ప్రస్తుతం దేశంలోకి వస్తున్న పెట్టుబడుల్లో అత్యధిక శాతం ఏపీకే తరలొస్తున్నాయన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలుచేస్తూనే, రాజధాని అమరావతిని, పోలవరం ప్రాజెక్టు పనులను కూడా పూర్తి చేస్తున్నారన్నారు. తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, దీపం -2 పథకాలతో పాటు అధికారంలోకి రాగానే పెన్షన్లను రూ.3 వేల నుంచి రూ.4 వేలకు తమ ప్రభుత్వం పెంచిందన్నారు. కూటమిలో ఉన్న పార్టీల కార్యకర్తలు గర్వపడేలా రెండేళ్ల పాలన సాగిందని మంత్రి సవిత తెలిపారు.





**జగన్ అతిపెద్ద వెన్నుపోటుదారుడు..** ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ విధ్వంస పాలన చేశారని మంత్రి సవిత మండిపడ్డారు. అమ్మఒడి, పెన్షన్లు పెంపు పేరుతో ప్రజలను జగన్ వెన్నుపోటు పొడిచారన్నారు. 2019 ఎన్నికల ముందు ఎన్నో హామీలు ఇచ్చి, వాటిని అమలు చేయడంలో జగన్ రెడ్డి విఫలమయ్యారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్ పథకాల అమలుకు ప్రాధాన్యమిచ్చిందన్నారు. బీసీ సంక్షేమ శాఖ తరఫున గతంలో కూడా అమలు చేయని ఎన్నో పథకాలను అమలు చేస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్యలతో ప్రభుత్వ విద్యా సంస్థలతో పాటు హాస్టళ్లు, గురుకులాల్లో ఇటీవల విడుదలైన టెన్త్, ఇంటర్ లో అత్యుత్తమ ఫలితాలు వచ్చాయన్నారు. వైసీపీ, కూటమి ప్రభుత్వాల అభివృద్ధిపై చర్చకు రావాలని జగన్ కు మంత్రి సవిత సవాల్ విసిరారు. ఏ శాఖపైనైనా, రాష్ట్రంలో ఏ నియోజక వర్గంలోనైనా చేపట్టిన అభివృద్ధిపై చర్చకు సిద్ధంగా ఉన్నామని ఆమె స్పష్టంచేశారు.

**ఆనాడు మీ పీఆర్ శాఖ నిద్రపోయిందా..?..** రాష్ట్రంలో అభివృద్ధిని, సంక్షేమాన్ని పరుగుల పెట్టడంలో మంత్రి నారా లోకేశ్ కాలి గోటుకు కూడా జగన్ గాని, ఆయన పార్టీ నాయకులుగాని సరిపోరని మంత్రి సవిత అన్నారు. 2014-19లో రాష్ట్రంలో పంచాయతీ రాజ్ శాఖ మంత్రిగా నారా లోకేశ్ గ్రామాల్లో విస్తృతంగా రహదారులు నిర్మించారన్నారు. ప్రస్తుతం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పీఆర్ మంత్రిగా పంచాయతీల్లో రోడ్లు నిర్మిస్తున్నారన్నారు. 2019-24 మధ్య ఒక్క రోడ్డు కూడా వేయలేదన్నారు. ఆనాడు ప్రభుత్వంలో పీఆర్ శాఖ నిద్రపోయిందా..? అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరవాత రాష్ట్రంలో అన్ని గ్రామాల్లోనూ, పంచాయతీల్లోనూ బీటీ, సిమ్మెంట్ రోడ్లను విస్తృతంగా చేపట్టామన్నారు. కూటమి పాలనతోనే రాష్ట్రాభివృద్ధి అని ప్రజలు విశ్వసిస్తున్నారన్నారు. కూటమిలో ఉన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో జరిగే ఏ ఎన్నికల్లోనైనా కూటమి మద్దతుదారులే గెలవాలని మంత్రి సవిత ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీ, ఇతర ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలొచ్చారు.

# జూలై 11న జరిగే జాతీయ లోక్ అదాలత్ ను జయప్రదం చేయండి..



**కందుకూరు,కలంకౌంటర్ :** సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికారి కమిటీ చైర్మన్ కే.కే.వి బులికృష్ణ జాతీయ లోక్ అదాలత్ జూలై 11వ తేదీన కందుకూరు కోర్టు నందు మండల న్యాయ సేవాధికార కమిటీ ఆధ్వర్యంలో జరగనున్నదని జాతీయ లోక్ అదాలత్ నందు ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా చర్యలు చేపట్టవలసిందిగా కందుకూరు సీనియర్ సివిల్ జడ్జి పోలీస్, అడ్వకేట్స్ మీటింగ్ లో మాట్లాడుతూ తెలియజేశారు. ఈ జాతీయ లోక్ అదాలత్ లో రెవెన్యూ, బ్యాంక్, బిఎస్ఎన్ఎల్, మున్సిపల్ అధికారులు ఎక్కువ కేసులు పరిష్కారమయేందుకు చూడాలని కందుకూరు సీనియర్ సివిల్ జడ్జి కం మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్ కే.కే.వి బులికృష్ణ తెలిపారు. కోర్టుల వరకు వెళ్ళని ఫ్రీ లిటిగేషన్ కేసులను కూడా పరిష్కరించుకోవలసినదిగా తెలియజేశారు. కోర్టులోని అన్ని రకముల సివిల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, భరణం కేసులు, గృహహింస కేసులు, రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, పరిష్కరించబడతాయని ఈ ప్రకటనలో తెలియజేశారు. ఈ అవకాశమును కక్షిదారులు అందరూ సద్వినియోగం చేసుకోవలసినదిగా సీనియర్ సివిల్ జడ్జి తెలిపారు. జూలై 11వ తేదీన జాతీయ లోక్ అదాలత్ కందుకూరు కోర్టు నందు జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశమును కక్షిదారులు అందరూ సద్వినియోగం చేసుకొని కేసులు త్వరితగతిన పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి డి . దుర్గా కళ్యాణి , అడిషనల్ మున్సిఫ్ మేజిస్టేట్ ఏ ల్ .అన్నపూర్ణ శ్రీ , కందుకూరు సబ్ డివిజనల్ డి ఎస్ పి సి హెచ్ . వి .బాల సుబ్రహ్మణ్యం , కందుకూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వలేటి శ్రీధర్ నాయుడు, సీనియర్, జూనియర్, మహిళా న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

# మైనారిటీల అభివృద్ధికి రూ.40 కోట్ల అదనపు నిధుల విడుదల స్వాగతార్హం

## -ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్



**అమరావతి,కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రధానమంత్రి జన వికాస్ కార్యక్రమం (ప్రావీజీఎఖ) అమలుకోసం మైనారిటీల సంక్షేమ శాఖకు రూ.40 కోట్ల అదనపు నిధులను విడుదల చేయడం హర్షణీయమని ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో మైనారిటీల సంక్షేమం, అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత లభిస్తోందని, ఆయన తీసుకుంటున్న సామాజిక సాధికారత చర్యలు మైనారిటీ వర్గాల్లో కొత్త విశ్వాసాన్ని నింపుతున్నాయని తెలిపారు. మంత్రి నారా లోకేష్ మైనారిటీ యువతకు నాణ్యమైన విద్య, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు కల్పించేందుకు చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. అలాగే మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్ మైనారిటీల సమస్యల పరిష్కారం, సంక్షేమ పథకాల సమర్థ అమలులో కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. ఈ అదనపు నిధుల ద్వారా మైనారిటీ ప్రాంతాల్లో విద్య, ఆరోగ్యం, నైపుణ్యాభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన మరింత వేగవంతం అవుతుందని అబ్దుల్ అజీజ్ ఆశాభావం వ్యక్తం చేశారు. మైనారిటీల అభ్యున్నతికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు మరింత ఫలితాలను ఇవ్వాలని ఆయన ఆకాంక్షించారు.

# కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి కు ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆత్మీయ విందు



**విజయవాడ,కలంకౌంటర్ :** కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి విజయవాడ పర్యటనలో భాగంగా మంగళవారం తాడిగడప లోని ఎమ్మెల్యే సుజనా చౌదరి క్యాంపు కార్యాలయానికి విచ్చేశారు.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుజనా చౌదరి కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి కు ఆత్మీయ స్వాగతం పలికారు.. శాలువా కప్పి పుష్పగుచ్చం అందజేశారు.. అనంతరం విందుకు ఆహ్వానించారు.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం విజయవంతంగా 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సుపరిపాలనను గురించి ఏపీ బీజేపీ అధ్యక్షుడు పీ వీ ఎన్ మాధవ్, ఎన్టీఆర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, మరియు బీజేపీ నేతలతో చర్చించారు...

# బ్రాహ్మణ సంఘం చేయూత



**కావలి,కలంకౌంటర్ :** బ్రాహ్మణ మహా సంఘం కావలి తరఫున మంగళవారంరోజు సాయంత్రం ఐదు గంటలకు శ్రీ చైతన్య జూనియర్ కళాశాల ఆవరణలో టి.ఉదయ్ కుమార్ శర్మ అపరకర్మల నిమిత్తం 15వేల రూపాయలు అందజేశారు.ఈ కార్యక్రమంలో అధ్యక్షులు పి వీఎస్ ప్రసాద్ అసోసియేట్ ప్రెసిడెంట్ ఎన్.మధుసూదన్ రావు శంకరమఠం అర్చకులు టి. మల్లికార్జున శర్మ పాల్గొన్నారు. బ్రాహ్మణ మహాసంఘం కావలి వారు ఎంతోమందికి ఎన్నో రకాలుగా ఆర్థికంగా వెనుకబడిన వారికి సహాయం చేస్తున్నారని ఇటీవల కూడా ఒకరికి అపర కర్మల నిమిత్తం పదివేల రూపాయలు వైద్య సహాయం నిమిత్తం15 వేల రూపాయలు అందజేశారు.

# భక్తిశ్రద్ధలతో మణిద్వీప వర్ణన పూజ





**అరకులోయ, కలంకౌంటర్ :** అరకులోయ లో నివాసముంటున్న ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య జర్నలిస్టుల సంక్షేమ సంఘం అల్లూరి జిల్లా కోఆర్డినేటర్ కాపుగంటి హరిబాబు, రాజ్యలక్ష్మి దంపతుల ఇంటి వద్ద మంగళవారం భక్తిశ్రద్ధలతో మణి ద్వీప వర్ణన పూజ వైభవోపేతంగా జరిగింది. అష్టైశ్వర్యాలు మనశ్శాంతి తో పాటు లక్ష్మీదేవి, శ్రీ లలిత దేవి అమ్మవార్ల కరుణాకటాక్షాలు ఉండాలని కోరుతూ భక్తిశ్రద్ధలతో జరిపిన మణిద్వీప వర్ణన పూజా కార్యక్రమంలో అరకులోయ యండపల్లి వలస గ్రామానికి చెందిన ఆర్యవైశ్య మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవార్లను దర్శించుకుని భక్తి శ్రద్ధలతో పూజలు జరిపారు. దీనిలో భాగంగా మణిద్వీప వర్ణన శ్లోకాలను ఆర్యవైశ్య మహిళలు భక్తితో పఠనం చేశారు. సుమారు మూడు గంటలకు పైగా మణి ద్వీప వర్ణన పూజా కార్యక్రమం జరిగింది. ముందుగా శ్రీ లలితా దేవి చిత్రపటానికి, లక్ష్మీదేవి విగ్రహానికి పుష్పాలతో అలంకరణ చేసి, పసుపుతో వినాయకుని తయారుచేసి భక్తితో పూజలు జరిపి మణిద్వీప వర్ణన ను తొమ్మిది సార్లు పఠనం చేశారు.

# రెండేళ్ల విజయోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి



**కావలి,కలంకౌంటర్ :** రాష్ట్ర ప్రభుత్వ రెండేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా నెల్లూరులోని కస్తూరిదేవి గార్డెన్స్‌లో నిర్వహించిన విజయోత్సవ సంబరాలు అట్టహాసంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో జిల్లా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, ఎన్డీఏ కూటమి నాయకులతో కలిసి కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డిపాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గత రెండేళ్లలో ప్రజలకు అందించిన అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ప్రజలకు వివరించే లక్ష్యంతో ఈ వేడుకలనునిర్వహించారు.ఈ సందర్భంగా కస్తూరిదేవి గార్డెన్స్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వివిధ ప్రభుత్వ శాఖల ప్రత్యేక స్టాళ్లను ఎమ్మెల్యే కావ్యకృష్ణారెడ్డిసందర్శించారు.. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమం అనే రెండు చక్రాలపై రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని వారు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో రాష్ట్రం అన్ని రంగాల్లో గణనీయమైన అభివృద్ధి సాధించిందన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ పారదర్శక పాలన, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోందనిపేర్కొన్నారు.

# ఏపీ పీఈసెట్ ఫలితాలు విడుదల చేసిన విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్



**అమరావతి, కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్‌లో ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపీ పీఈసెట్-2026) ఫలితాలు విడుదలయ్యాయి. రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ ఈ ఫలితాలను మంగళవారం ప్రకటించారు. ఈ ఏడాది పీఈసెట్‌లో మొత్తం 89.76 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు ఆయన తెలిపారు. ఫలితాల వివరాల్లోకి వెళితే, పీఈసెట్-2026 కోసం మొత్తం 4,037 మంది అభ్యర్థులు నమోదు చేసుకోగా, 2,958 మంది పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 2,655 మంది అర్హత సాధించారు. అర్హత సాధించిన వారిలో పురుషులు అధికంగా ఉన్నారు. పరీక్షకు హాజరైన పురుషుల్లో 92.91 శాతం (1,993 మంది) ఉత్తీర్ణులు కాగా, మహిళల్లో 81.43 శాతం (662 మంది) ఉత్తీర్ణత సాధించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ, ఫిజికల్ ఎడ్యుకేషన్, క్రీడల రంగంలో కెరీర్‌ను ఎంచుకునే దిశగా ముందడుగు వేసిన అభ్యర్థులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. వారి భవిష్యత్ ప్రయత్నాలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

# ఏపీ మంత్రి నారా లోకేశ్ ను కలిసిన దక్షిణాఫ్రికా క్రికెట్ దిగ్గజం జాంటీ రోడ్స్

**అమరావతి, కలంకౌంటర్ :** ఏపీ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, దక్షిణాఫ్రికా లెజెండరీ క్రికెటర్ జాంటీ రోడ్స్‌తో భేటీ అయ్యారు. క్రీడల్లో తన అభిరుచి, క్రమశిక్షణ, నైపుణ్యంతో ప్రపంచవ్యాప్తంగా ఎన్నో తరాల క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలిచిన జాంటీ రోడ్స్‌ను కలవడం ఆనందంగా ఉందని లోకేశ్ పేర్కొన్నారు. ఈ సమావేశానికి సంబంధించిన వివరాలను ఆయన సోషల్ మీడియా ద్వారా పంచుకున్నారు. ఈ భేటీలో క్రీడలు, యువత అభివృద్ధి, క్రీడల్లో అత్యుత్తమ సంస్కృతిని నెలకొల్పడం వంటి అంశాలపై తామిద్దరం ఆసక్తికరంగా చర్చించుకున్నామని లోకేశ్ తెలిపారు. ప్రపంచస్థాయి క్రీడా వ్యవస్థను నిర్మించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. అంతర్జాతీయంగా అనుసరిస్తున్న అత్యుత్తమ పద్ధతులను అందిపుచ్చుకుని, భవిష్యత్ ఛాంపియన్‌లను తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకెళ్తామని మంత్రి లోకేశ్ వివరించారు. రాష్ట్రంలో క్రీడారంగాన్ని ప్రోత్సహించి, ప్రతిభావంతులైన యువతకు అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన పునరుద్ఘాటించారు.

Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com